
నాటిక

(ఒక బెంగాలి నాటికకు అనుసరణ)

# వాన జల్లు

శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యము



(సాధారణ మధ్య తరగతి కుటుంబపు అద్దె యింట్లో బైటగది. ఎవరైనా వస్తే యిక్కడే కూర్చోపెట్టారు. అబ్బాయి చదువుకోటం గూడా యిక్కడే. ఒకమూల చదువుకునేందుకు టేబు లుంది. అబ్బాయికి పదిహేనేండ్లు. గది తలుపులు, కిటికీలు వేసి, అబ్బాయి టేబిలు దగ్గర మాట్లాడ కుండా కూర్చొని ఉంటాడు. శ్యామల గదిలోకి వస్తుంది. వయస్సు ముప్పయి. మామూలుగా చీర కట్టుకొని ఉంటుంది.)

శ్యామల: మళ్ళీ మొదలుపెట్టావు .తలుపులు కిటికీలు వేసుకొని కూర్చోటం? రోజు రోజుకు నీ కేమౌతున్నది, అబ్బాయి? ఏమిమిదయింది. గదిలో ఏమి టీ చీకటి? (శ్యామల కిటికీ తియ్య బోతుంది)

అబ్బాయి: (చికాకుగా) వద్దు, వద్దు, కిటికీ తియ్యవద్దు?

శ్యామల: ఏం?

అబ్బాయి: నాకు బాగులేదు.

శ్యా: మళ్ళీ అదే మాటా—"నాకు బాగులేదు, నాకు బాగులేదు," అని. చూస్తున్నాను. నీ కీ రోజుల్లో ఏమీ బాగుండటము లేదు. ఈ వయ సులతో కలిసి మెలిసి తిరగటం ఏమీ లేదు. ఎప్పుడూ ముఖం ముడ్చుకొని గదిలో కూచుంటావు. ఇలా చేస్తే జబ్బు చేయ.........

అ: నాకు జబ్బు వస్తే ఎవళ్ళకేం?

శ్యా: అంటే?

అ: (కోపంతో నుంచొని) "అంటే, అంటే" ఈ అర్థాలన్నీ నాకు తెలియవు. నన్ను కొంచెంసేపు ఒంటరిగా ఉండనిస్తావా?

శ్యా: (నొచ్చుకొని) మీ నాన్న నీ కోసం చూస్తున్నారు. అందుకని –

అ: (ఉక్రోషంగా) అందుకని, నన్ను వెతుక్కుంటూ వచ్చావా? ఇంకేం, యిహ వెళ్ళు, నాన్నకు రిపోర్టు యిచ్చిరా.

శ్యా: రిపోర్టు?

అ: ఆ, నాకోసం రోజంతా ఏమేమి చేశావో అదంతా.

శ్యా: (దుఃఖ మాపుకొని, దగ్గరగా వచ్చి) ఈ మాదిరిగా ఎందుకు మాట్లాడుతుంటావు. అబ్బాయి? నా మనస్సు కష్టపెడతావా?

అ: నీకు కష్టం ఎందుకని? అందరూ నిన్ను పొగడేవాళ్ళేగా. ఎంత మంచి అమ్మ, ఎంత చక్కగా సంసారం గడుపుతుందో అని.

శ్యా: నీ మనస్సు ఎవరు పాడు చేశారో నా కేమి తెలియటం లేదు.

(శ్యామల లోపలికి వెళ్ళిపోతుంది, అబ్బాయి పిలుస్తాడు)

అ: ఇదిగో, నాన్నతో చెప్పు, నేను ఇహ హాస్టల్లో ఉండి చదువుకొంటానని.

శ్యా: మనింట్లో చోటు చాలటం లేదుగావును!

అ: ఇక్కడ చదువు సాగటం లేదు. ఇంత పని గిస్తే ఎవరు మాత్రం చదవగలరు?

శ్యా: చదవాలని ఉంటే తప్పక సాగుతుంది. ఇంటి పని నే నెంత చేస్తున్నానో నీకు తెలుసుగా. అంత చేస్తూ గూడా ఎం. ఏ. ప్యాస్ అయ్యానా, లేదా!

అ: నేను నీ అంతటి జీనియస్‌ను కాదు.

శ్యా: ఆ మాట కాదు నే ననేది. మీ చుట్టాలందర్ని చూడు — ఇంతమందికి చదువుకొనేందుకు కాస్త గూడా చోటులేదే. బజారునుంచి కావలసి వస్తువులు తేవటం దగ్గరనుంచి—

అ: అదొక్కటే బాకీ ఉండిపోయింది కదూ. ఇంకేం, పని మనిషిని మానిపించి ఆ పని గూడా నా నెత్తిన వెయ్యి. దాంతో నీకు బాగా సంతోషం వస్తుంది ఏం?

శ్యా: (కోపంతో) ఏమిటి, మరీ మాటలు ముదురుతున్నాయి? రోజు రోజుకు కోతి వెధవ్వవుతున్నావు. మీ నాన్న ఆస్కారం చూసుకొని తల తిరుగుతున్నది కదూ. నేనయితే—

అ: కొరడాతో నాలుగు తన్ని, యింట్లో కట్టిపడేసే దానివి. కానీ. ...నీ కేది యిష్టమో అదే చేయి. వాళ్ళు వీళ్ళు చూసేట్టు ఆ నటనంతా ఎందుకు?

శ్యా: నటనా! ఏమిటి నీ వనేది?

అ: కాకపోతే ఏమిటి? అత్తయ్యను ఇదివరకే వెళ్ళకొట్టావుగా. నన్ను గూడా ఆ కాస్త పనీ చెయ్యి.

శ్యా: మీ అత్తయ్యనా? నేను వెళ్ళిపొమ్మని చెప్పానా?

అ: అయితే యిన్ని రోజుల తర్వాత హఠాత్తుగా ఎందు కెళ్ళిపోయింది.

శ్యా: అది మీ నాన్నకు తెలుసు.

అ: నాన్నకు నువ్వే నేర్పావు. ఆయన కిదంతా ఏం తెలుసు? నేను హాస్టల్లో ఉండే ఏర్పాట్లు చేసెయ్యి. నే నింకా ఒక్క రోజు గూడా యింట్లో ఉండదలుచుకోలేదు. డబ్బుఖర్చవుతుందని హాస్టల్‌లో ఉండనియ్యవా? స్పష్టంగా చెప్పు. ఆత్మహత్య చేసుకుంటాను.

(అబ్బాయి లోపలి కెళ్తాడు. శ్యామల మౌనంగా కొద్ది క్షణాలుండి, కిటికీ తెరుస్తుంది. లోపలి నుంచి అబ్బాయి కేకవెయ్యటం వినిపిస్తుంది. శ్యామల దుఃఖ మాపుకుంటుంది. ఆఫీసు కెళ్ళే బట్టలు వేసుకుంటూ గోపాలరావు ప్రవేశిస్తాడు. నలభై ఏళ్ళకు పైగా వయస్సు. భారీ విగ్రహం)

గోపాలరావు: ఏమిటి, పొద్దున్నే పోట్లాట మొదలుపెట్టారూ? ఎవరైనా తెల్లవారటంతోటే భగవన్నామ సంకీర్తనం చేస్తారు. (కొంచెం ఆగి) ఏమయింది శ్యామలా? తుమ్మల్లో పొద్దూకినట్లుందేం మొహం?

## పాత్రలు

శ్యామల

అబ్బాయి

గోపాలరావు

నారాయణ (స్నేహితుడు)

పాప (అమ్మాయి)

శ్యా: ఇంక ఆపండి మీ సరసాలు. నాకు వళ్ళు మండిపోతూంది. ఈ దరిద్రపు వెధవ నన్ను లేని మాటలన్నీ అంటాడా?

గో: అవును. దరిద్రుడే......వాడి మాటలు పట్టించుకోకపోతే సరి.

శ్యా: మీ కేమి అర్థమవుతుంది. రోజంతా బైట గడుపుతారు. ఇంట్లో సంగతు లేమి తెలుస్తాయి.

గో: బైటి సంగతులు తెలుసు; ఇంట్లో సంగతులు కూడా తెలుసు. కానీ, అన్ని సంగతులు నేనే తెలుసుకుంటే మరి నువ్వేం చేస్తావు?

శ్యా: అయితే, ఇంట్లో సంగతులు మీ మాటలలో కెక్కవు ఎందుకని? మీ అక్కయ్యను కాశీకి ఎందుకు పంపించారు? ఆమెను ఇంట్లోనుంచి వెళ్ళగొట్టానని అబ్బాయి అనుకొంటున్నాడు ఎప్పుడూ.

గో: నిజ మేమిటో వాడికే మెల్లిగా తెలుస్తుంది. ఒక రోజు.

శ్యా: నా కా నమ్మకం పోయింది. వాళ్ళ అత్తయ్య వెళ్ళినప్పటినుంచీ, వాడు పూర్తిగా మారిపోయినాడు. ఇదివర కెప్పుడూ ఇలా లేదు. ఎంతసేపటికీ నాతో పోట్లాటే.

గో: ఏమయినా, రెండు చేతులు కలిస్తేగా చప్పుడవుతుంది!

శ్యా: అంటే మీరనేది నేను గూడా పోట్లాడుతున్నాననే?

గో: అది కాదు నే ననేది, శ్యామలా! నువ్వు మాట్లాడకుండా వూరుకుంటే, వా డెంతసేపు అరుస్తాడు?

శ్యా: ఇప్పు డెంత అసహ్యంగా మాట్లాడుతున్నాడో మీ కేమి తెలేదు. వాడికి ఎవళ్ళు చెప్పినా తల్లోకి ఎక్కేటట్లు లేదు. మీ రొచ్చేముందు ఏమంటున్నాడో తెలుసా, ఇహ వా డీ యింట్లో ఉండడట. హాస్టలుకి పంపించాలిట.

గో: హాస్టలా? అవునులే, చదువుకునేందుకు హాస్టలు బాగానే ఉంటుంది. నేనూ హాస్టల్లో ఉండి చదువుకొన్నాను.

శ్యా: మీరంటే చెన్నపట్నంలో చదువుకొనే వారు. మీ నాన్న, అమ్మ ఉయ్యూరులో ఉండేవారాయెను. హాస్టల్లో ఉండక ఏమి చేస్తారు? కాని, అబ్బాయి ఉన్న దుఃఖం చాలక యిల్లు వదిలేసి హాస్టల్లో ఉండే ఖర్మ ఏం వచ్చింది?

గో: ఆ. ఒక్కటే సంగతి ఆలోచించాల్సిందేమిటంటే, హాస్టల్లో తిండితిప్పలు బాగుండదు. కాని, మెల్లిగా అలవాటయిపోతుందిలే.

శ్యా: అంటే, వాడిని మీరు హాస్టలుకి పంపి ఒక్కడిన్నే ఉంచుతారా?

గో: మరి వాడు మొండిపట్టు పట్టినప్పుడు, అలా చేయకపోతే మళ్లీ దానికి గోలవుతుందేమో!

శ్యా: (విసురుగా) మీ యిష్ట మొచ్చినట్లు చేసుకోండి. ఎలాంటి కొడుకో, అలాంటి తండ్రి. కుర్రాడన్నాడనంగానే వాడిని హాస్టలుకి పంపించి తీరాల్సిందే గావును. (కొంచెం ఆగి) ఎటొచ్చీ నీ కొచ్చి పడింది, ఇంతవరకూ మీ అక్కయ్యను వెళ్లగొట్టానని అబ్బాయి అనుకొంటున్నాడు. ఇహ వాడూ హాస్టలుకి వెళ్తే మన వాళ్లంతా వాడిని వేరు వేసింది గూడా నేనే అనుకొంటారు. ఇప్పటికి తెలిసింది, సవతి తల్లి అవటం ఎంత పాపమో, స్వంత పిల్లలయితే యిలాంటి కలతలేమీ రావుగదా.

గో: ఈ కలతలన్నీ ఎందు కెక్కువవుతున్నాయో వాడితో మాట్లాడరాదూ? స్వంత పిల్లవాడు పరాయి పిల్లవాడికన్నా ఏమీ ఎక్కువ కాదు. అంతా మన మనస్సు మీదే ఆధారపడి ఉంటుంది. నీ మనస్సు, అబ్బాయి మనస్సు—

శ్యా: కాని వాడిని నేను ఏమీ దండించలేకుండా ఉన్నాను. ఎప్పుడూ వాడు ఏమనుకొంటాడో అని భయమే. వాళ్ల అమ్మ సంగతి జ్ఞాపకమొచ్చి దిగులు పడతాడేమో అనిపిస్తుంది.

గో: శ్యామలా, మన పెద్దవాళ్లు అంటూండే వాళ్లు నీకు తేలీదూ— ఎవరైతే ప్రేమిస్తారో వాళ్లే దండిస్తారని. నాకే మనిపిస్తున్నదంటే—

శ్యా: చాల్లెండిగానీ, ఇంక లెక్చర్ ఆపండి. మీ రీ మధ్య యిస్తున్న ఉపన్యాసాలు వింటూంటే, అతనెవడో అన్నాడే అది జ్ఞాపక మొచ్చింది— డోన్టు టాక్ బిగ్‌వర్డ్స్, డేమీన్ పొలిటిక్.

గో: (నవ్వి) ఇంగ్లీషు చదువుకొంటే ఎంత నుగుణమో చూశావా? సరిగ్గా అవసరం వచ్చి

నప్పుడు, చప్పున కొటేషన్ యివ్వవచ్చు గదూ, ఏమంటావు?


# హింద్ రేడియో



**5 వాల్వులు, 3 బ్యాండ్లు**
**ఏసి/డిసి ఉడన్ క్యాబినట్టు**
**రు. 185/-**

ఆంధ్రప్రదేశ్, మైసూర్ స్టేట్, మద్రాస్ సిటీ
డిస్ట్రిబ్యూటర్లు:

# రేవతి రేడియోస్

**25, నారాయణ మొదలి వీధి,**
**మదరాసు-1.**

**షో రూము:**
**121, నేతాజీ రోడ్, మద్రాసు-1.**

**డీలర్లు:**

**1.** కాళిదాసు రేడియోను, హైదరాబాదు. 2. రేడియో హోము, విశాఖపట్నం. 3. ఇండో ఫ్రెంచి ట్రేడింగ్ కంపెనీ, అమలాపురం. 4. రాధా చిట్ ఫండ్సు, పాలకొల్లు. 5. మూర్తి ఇండస్ట్రియల్ ఎన్‌టర్‌ప్రయిసస్, విజయవాడ. **6.** ది రాయల్ ఎలక్ట్రికల్ అండ్ రేడియోస్టోర్స్ అనకాపల్లి. 7. దాస్ వాచ్ కంపెనీ,నిజామాబాద్. 8. యూనివర్సల్ రేడియో హౌస్, అనంతపురం. **9.** శ్రీ అరవింద్ ఏజన్సీస్, ప్రొద్దుటూరు. 10. ఎస్. ఎస్. బ్రదర్స్, మహబూబ్‌నగర్. 11. ది రేడియో అండ్ ఎలక్ట్రికల్ హవుస్,గుంటూరు. 12. అద్దెప్ప బ్రదర్స్, ఎమ్మిగనూరు.

**ఏజంట్లు లేనిచోట్ల**
**ఏజంట్లు కావలయును.**
**వివరములకు వ్రాయండి.**


శ్యా:పొనిద్దురూ, మీకెప్పుడూ హాస్యమే..... పాప పుట్టిన తర్వాత మిమ్మల్ని ఎన్నిసార్లు హెచ్చరించానో మీకు గుర్తుందీ? దాన్ని అంత ముద్దు చేయవద్దనీ— నామాట ఏమన్నా విన్నారా? పనీ పాటా గూడా మరిచిపోయి, దాన్ని ఎత్తుకొని ఆడిస్తూ కూర్చుండేవారు. అప్పటినుంచీ అబ్బాయి లోలోపల కుళ్లుతూండేవాడు. నేను వాడి మొహం చూసి కనుక్కోగలిగేదాన్ని. తండ్రి అయ్యుండి కూడా మీరేవీ తెలుసుకోలేక పోయారు. నాకు ఆశ్చర్యంగా వుంది.

గో: అర్థం చేసుకోవాల్సిన అవసరం లేక పోయింది. పసిపిల్ల పుట్టిందనగానే అక్క అన్నల మనస్సులు కొంచెం కష్టపడతవి. ఇది పట్టుకొని తలకాయ పాడు చేసుకోటం ఎందుకు? నామటుకు నేను చిన్నతనంలో మా తమ్ముడిని ఎప్పుడూ కొట్టూండేవాడిని. (నేపథ్యంలో—''అమ్మా, మామయ్యవచ్చాడు.నాన్నా,నారాయణ మామయ్య'' అంటూ నారాయణను లాక్కొస్తూ పాప ప్రవేశిస్తుంది. నారాయణ ముప్పయి ఏళ్ల యువకుడు. పాపకు తొమ్మిది, పదేళ్లుంటయి. చాలా చురుకుగా ఉంటుంది.)

పాప: చూశావు, అమ్మా, మామయ్య ఇన్నాళ్ల తర్వాత వచ్చి, నేనడిగితే, 'ఏం, నేను ప్రతిరోజు వస్తూనే ఉన్నాగా' అంటున్నాడు. (నారాయణతో) బహుశా నువ్వు ఇన్‌విజిబుల్ మాన్ అయ్యావు గావును. అందుకే మేము చూడలేకపోయినాము.

నారాయణ: నువ్వు కాశీ మజిలీ కథ చెప్పే దానివి కదూ! నేను గూడా అలాగే కొన్నాళ్లు తిరిగి వద్దామని వెళ్లేను.

పా: ఎక్కడికి వెళ్లేవు. మామయ్యా? మాతో చెప్పనే లేదు కదూ—

నారా: హఠాత్తుగా వెళ్లాలిసి వచ్చింది. ఎలా చెప్పడం. ఇదిగో ఆ ఎవరెస్ట్‌కు వెళ్లి తిరిగొచ్చా. ఎన్నాళ్ల నుంచో టెన్సింగ్ పిలుస్తున్నాడు కదూ!

పాప: ఓహ్, ఏం గమ్మత్తు చేస్తావు! ఇదివరకు అట్లాంటిక్ సముద్రం అట్ట అడుగు వెళ్లి ఒక గోల్డెన్ ఫిష్ సంపాయించా నన్నావు కదూ. బలే అబద్ధాలు చెప్తావు, మామయ్యా నువ్వు.

గో: నిజం, నారాయణా, నిన్ను ప్రతిరోజు పిల్లలు తలుస్తుంటారు. నిన్ను వాళ్ల యీడు వాడిలాగే అనుకొంటారు లాగుంది.

నారా: నాకు గూడా అలాగే అనిపిస్తుంది గోపాలరావు. పిల్లలతో ఎంతసేపున్నా హాయి అనిపిస్తుంది. జ్వరమొచ్చి వారం రోజులు ఇల్లు కదల లేదు. అందుకనే రావటం పడలేదు.

శ్యా: అదే నాకు అర్థం కాలేదు. ఆరోజొచ్చి అబ్బాయి రోల్ నెంబరు తీసుకెళ్తా నన్నావు.

నా: అందుకే ఈవాళ వచ్చాను అక్కయ్యా. వాడి రోల్ నెంబర్ తీసుకొంటాను. కృష్ణమూర్తికి ఫోన్ చేశాను. రిజల్ట్సు యివాళ తెలుస్తాయట.

శ్యా: **అబ్బాయి యిహ హాస్టల్లో ఉండి చదువు కొంటానంటున్నాడు.**

గో: మళ్లీ ఆ సంగతెందుకు? **అదంతా నారా**యణ మీద వదిలిపెట్టు. వాడికేం చెప్పాలో **అతనికి** తెలుసు. పాపా, వెళ్లి అన్న నొకసారి **పిల్చుకురా,** అమ్మా. **(పాప వెళ్తుంది.)**

గో: వాడికి నిజంగా హాస్టల్లో **ఉండాలని** ఉంటే, నాకేమి అభ్యంతరం లేదు. **నారాయణ,** అక్కడే చదువు బాగా సాగుతుంది.

శ్యా: నాకు ఎంతమాత్రం యిష్టం **లేదు** తమ్ముడూ. ఇంట్లో ఉండి చదువుకోటం **అన్ని** విధాలా మంచిదని వాడికి నచ్చచెప్పు. వాడొక్కడూ ఉండలేడు. నేనెరగనూ వాణ్ణి! వాడింకా పసివాడు!

నారా: సరే చూస్తాను, వాడేమంటాడో **కాని,** హాస్టల్‌కు వెళ్లటం సంగతి యిదివర **కెప్పుడూ** వినలేదే.

శ్యా: ఇవాళే మొదటిసారి అన్నాడు. హి **ఈజ్** డిటర్‌మిన్‌డ్. నేను చెప్తున్నాగా, యిది **పట్టు**కొని ఎక్కడలేని గోల చేస్తాడు..... ఎందుకైనా మంచిది నేను లోపల వెళ్తాను. నన్ను చూస్తే వాడికి మరింత కోపం వస్తుంది.

**(శ్యామల లోపలికి పోతుంది)**

గో: ఎంత చిన్న విషయాలకైనా గాబరా పడతారు గదా ఆడవాళ్లు!

నా: కాదు,గోపాలరావు, నేనొప్పుకోను. అక్కయ్యకు కావలసినంత ధైర్యముంది. నేను **అన్ని** సంగతుల్లోను ఆమెను మెచ్చుకొంటుంటాను. కాని, అబ్బాయి రోజురోజుకు ప్రాబ్లం చైల్డ్‌లా తయారవుతున్నాడు. ఈ మధ్య వాడనే **మాటలు** నాకేమీ అర్థం కావటం లేదు.

గో: నువ్వు గూడా ఆ మాటేనా, నారాయణా?

నా: అవును. ఇది చాలా సీరియస్ **థింగ్.** ముఖ్యంగా పిల్లలకు ఈ వయస్సులో, **పద్నాలుగు** నుంచి పదహారు దాకా ప్రాపర్లీ గైడెడ్ **కాకపోతే,** చాలాచాలా అవటానికి అవకాశం ఉంది. **ఉపరి,** ఈ స్టేట్ ఆఫ్ మైన్డ్‌లో **మెలాన్‌కలియ** ఏర్పడ్డప్పటికీ, ఆశ్చర్య మేమీ ఉండదు.

గో: నాతో మాట్లాడే టప్పుడు ఏమీ అర్థం కాదే. కంప్లీట్‌గా నార్మల్‌గా ఉంటాడు.

నా: అలాగే ఉంటుంది. వాడు చాలా ఇంటెలిజెంట్ కుర్రాడు. నీ దగ్గర నా దగ్గర కనపడనివ్వడు. కానీ, తక్కిన సమయాల్లో గుడ్ చేస్తూంటాడు. వాడు లోలోపల అనుకోటం **తనీ** ప్రపంచంలో ఒక్కడేనని— అమ్మలేదు, నాన్న లేడు, ఎవ్వరూ లేరని.

గో: మనందరము మాత్రం ఒక్కళ్లమూ కాదూ? నారాయణా? అక[illegible] ఎవరో [illegible] మనస్సుకు తట్టున్నది—''[illegible] వలె మధుర విరక్తిలో ఏకాకిని.''[illegible]

[illegible] చేసే ఏకాంతంలో మాధుర్యం ఉంది. కాని, అబ్బాయి మనస్సు **ఆ** విధంగా పోదు.

వాడిలో అసహాయత్వపు దుఃఖం నిండి ఉన్నది. అది నిజానికి జాలి చెందాల్సిన సంగతి. దాంట్లో వాడి తప్పేమీ లేదు. అందరూ వాడికి బోధ పర్చారు. సవతి తల్లి ఎప్పుడూ గూడా సవతి తల్లే నని, ఆమె తనకు ఏ విధంగా గూడా మంచి చెయ్య లేదనీ, ఆమె తన తండ్రిని తనకు దూరం చేస్తుం దనీ.... వాడు తనంతట తాను అబ్‌నార్మల్ అను కుంటాడు. ఇక్కడే ఉంది ట్రాజెడీ అంతాను.

గో: హూ, ఆలోచించాల్సిన విషయ మేనే!

(అబ్బాయి వస్తాడు.)

అ: మామయ్యా, నువ్వు రోల్ నెంబర్ అడి గావు కదూ, ఇదిగో ఈ కాగితము మీద రాసి యిస్తున్నాను.

నా: ఏరా, బాగా చిక్కిపోయినట్లున్నావు. కులాసయేనా?

అ: ఆ. ఇవాళ నిద్ర లేవటం కొంచెం ఆలస్య మైంది.

గో: నారాయణా! నేను వస్తాను మరి. ఆఫీసు టైమయింది.

నా: మేమూ మళ్లీ సాయంత్రం వస్తా.

గో: అబ్బాయి, ఇవాళ సాయంత్రం టవున్ హాలులో టెన్నిస్ మాచికి వెళ్తావా?

అ: ఎవరెవరు ఆడుతున్నారు?

గో: ఇవాళే ఫైనల్స్.

అ: పోనిద్దురూ. ఇవాళ అసలు బైటికి వెళ్లను.

గో: ఏం?

అ: వూరికేనే. (పేలవంగా నవ్వి) నాకు చికాకుగా ఉంది.

గో: వో. (అబ్బాయి వైపు తిరిగి) సరే, వస్తాను. (పోతాడు.)

నా: టెన్నిస్ అంటే నీ కెంతో యిష్టంగావును. అదంతా యిప్పుడు వదిలిపెట్టుకొన్నా వేమిటి?

అ: వదులుకొంటే అన్నీ పోతయి, ఏమిటి మిగులుతుంది?

నా: అంతా పెద్దవాళ్లలాగే మాట్లాడుతున్నా వేమిటిరా?

అ: పెద్దవాణ్ణి కావటంలా మరి—

నా: నీకు హాస్టల్లో ఉండాల నుందంటున్నాడు మీ నాన్న—

అ: ఆ, అదే నిశ్చయించాను.

నా: హాస్టల్లో హాయిగా చదువు సాగుతుం దనుకొంటున్నావేమో. చాలా పొరపాటు. పిల్లలు చాలా డిస్టర్బ్ చేస్తారు.

అ: కావచ్చు.

నా: ఇంట్లో అయితే నీ పాఠాల్లో ఏవైనా తెలీని సంగతులు నాన్నగాని అమ్మగాని చెప్పడానికి వీలుంటుంది.

అ: వాళ్లకు టైమేది?

నా: ఏం?

అ: నాన్న, ఆయన పనితోటే తీరకుండా ఉంటారు. ఇహ, అమ్మకు సోషల్ వర్క్. పొద్దున లేచి ఆ సంగతులే ఆలోచిస్తూ కూర్చుం టుంది. నా చదువు సంగతే ఏమీ చూడలేదు, నాకు చదువు చెప్పుంది!

నా: నువ్వసలు ఏ లైనుకు పోదా మనుకుం టున్నావు?

అ: ఇంజనీరు కావాలని కోరిక ఉంది. అందుకే సైన్సు తీసుకొందా మనుకొంటున్నాను. ఆర్ట్సు చదివితే ఏం లాభము? ఏ ఫ్యూచర్ లేదు.

నా: డాక్టరుకు చదివేట్టయితే బైయాలజీ తీసుకోవాలి.

అ: డాక్టరు వద్దు. ఇంజనీరైతేనే మంచిది. ఎక్కడో దూరంగా ఉద్యోగం సంపాయించుకో వచ్చు. అవును, మామయ్యా, బైటికి ఎక్కడికైనా యిప్పు వెళ్లడానికి వీలు లేదూ?

నా: ఎక్కడికి?

అ: ఈ దేశం వదిలిపెట్టి, యూరప్‌లో చదువుకొనేందుకు ఎంతమంది పిల్లలు వెళ్తారు! వాళ్లెంత మజా చేస్తారో! నాకేగాని బాగా డబ్బున్న ట్లయితే, నేను తప్పక వెళ్లిపోయేవాణ్ణి.

నా: ఒక్కడివే వెళ్లి ఉండగలవా?

అ: ఇక్కడ మాత్రం నేను ఒక్కణ్ణి కాదూ?

నా: ఎవరి కోసం గూడా దిగులుపడవు?

అ: ఏమో! (కొంచెం ఆగి) మామయ్యా, నా స్నేహితుడు వేణును గురించి నీతో చెప్తుండే వాణ్ణి, వాడు ఇంట్లో నుంచి పారిపొయ్యాడు.

నా: పారిపొయ్యాడా? ఎందుకని?

అ: వాడు వాళ్ల పెద్దనాన్న దగ్గర ఉండేవాడు. ఆయన చాలా కోపిష్టి. ఎప్పుడూ వీడిని కోప్పడి, కష్టపెట్టేవాడు. పాపం రోజూ తిండి కూడా సరిగా వుండేదికాదు. చాలా రోజులు సహించాడు. చివరకు పారిపొయ్యాడు.

నా: ఇప్పు డెక్కడున్నాడు?

అ: పూనాలో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగము సంపాదించుకొన్నాడు. మా క్లాసు ఫ్రెండు ఒకతని అన్న అక్కడ మేనేజర్‌గా ఉంటున్నాడు. ఆయన ద్వారా యిది దొరికింది.

నా: పాపం! ఈ వయసులోనే ఉద్యోగం చెయ్యటం—

అ: కానీ, వాడు చాలా సంతోషంగా ఉన్నాడు. నిన్ననే వాడొక ఉత్తరం రాశాడు. అది ఎంత చక్కగా ఉన్నదని. చదువుతా నుండు. (చదువుతూ) "ఇప్పుడే ఆఫీసు పని పూర్తి చేసి ఇంటి కొచ్చాను. బైట కొంచెంగా జల్లు పడుతున్నది. బేరర్‌ని టీ తీసుకురమ్మన్నాను. ఇవాళ బైటికి షికారు పోను. హాయిగా చదువుకొంటాను. నన్ను విసిగించ డానికి ఎవ్వరూ లేరు. ఒక్కణ్ణి. ఆ మాట అను కొంటేనే ఎంతో సంతోష మవుతుంది. ఇదివరకటి రోజులు తలుపుకు వచ్చినపుడల్లా అవి ఎలాగా గడిచినయ్యా అని ఆశ్చర్యపోతూంటాను. గట్టిగా వూపిరి వదిలేందుకు కూడా భయమేసేది. నే నిక్కడ ఎలా ఉన్నానో నీ కర్థం కాదు. ఇదంతా ఒక కొత్త ప్రపంచంలా వుంది. ఎంత ఆనందంగా ఉందని! కాలేజీలో చేరే ముందు ఒకసారి వీలైతే నా దగ్గరకు రా. చూద్దువు గాని, నాలో ఎంత పరి వర్తన వచ్చిందో. నే నిదివరకటి వేణుని కాను. ఇట్లు, నీ వేణు." ఏం మామయ్యా, చాలా బాగుందిలే ఉత్తరం?

నా: అతనివైపు నుంచి చూస్తే బాగుగానే ఉంది. అతని కెవ్వరూ లేరన్నావు కదూ!

అ: "ఇదంతా ఒక కొత్త ప్రపంచంగా ఉంది. ఎంత ఆనందంగా ఉందని."

నా: నేనొకసారి లోపలి కెళ్లి వస్తాను. మీ అమ్మతో ఒక మాట చెప్పాలి.

(పోతాడు)

(మిగతా ౫౮ వ పేజీలో)

ఇన్ఫెన్‌టోన్
గ్రైప్‌వాటర్
తక్షణ నివారణ కోసం




పసిబిడ్డలకు దివ్యమైన గ్రైప్ మిక్స్చర్. కడుపు నొప్పి, పళ్లు వచ్చుచున్నప్పుడు, కడుపులో వాయువువల్ల, కలిగే జబ్బులను తక్షణం నివారించును. పసిబిడ్డలను ఆనందంగాను ఆరోగ్యంగాను వుంచును. 40 ఏళ్లకు మించి బాగుగా ప్రసిద్ధియున్నట్టిది.

నిర్మాతలు:
హైదరాబాద్ కెమికల్స్ అండ్ ఫార్మసుటికల్ వర్క్సు లిమిటెడ్.
హైదరాబాద్-దక్కన్

# జవాబులు

[40 వ పేజీ తరువాయి]

## బి. పాప, ఆల్లిపురం

కళ్ళతో చూసి, కాళ్ళతో మట్టేసినవి, నేను వీరి ప్రమదావనంలో పరిచయం చేస్తున్నా వంటారా? అవును. కాళ్ళకి తగిలేవీ, కళ్ళ కద్దుకో వలసినవీను!

## ఎమ్. సుభద్రాదేవి, హైదరాబాద్

"రేడియో కొన్న కొత్తలో రోజూ పెద్ద పోట్లాట జరిగేది. ఉదయం ఏడు గంటలకి అమ్మ గారు మద్రాసులో ఆంధ్ర సమ్మేళన్ పెట్టమనే వారు. మా తమ్ముడు సిలోన్. నాన్నగారూ అన్నలూ 'న్యూస్' అనేవారు. నాకు ఏమైనా యిష్టమే!"—అయితే, మీరు సుఖపడతారు. మా యింట్లో ఈమధ్య రేడియో వొట్టి అలంకార ప్రాయమై పోయింది. ఎవరికీ పెట్టే తీరిక ఉండటం లేదు. ఒక్క 'సర్దార్ పణికర్' టాక్ మట్టుకు విన్నాం ఈమధ్య!

## ఎమ్. లత. పెద్దాపురం

మీరంత తొందరగా నిరుత్సాహపడితే ఎలా? పెద్దక్క చదువు అయిపోయాక, మీరు చదువుకో వచ్చు—లేకపోతే ప్రయివేటుగా కట్టవచ్చు. పెద్ద పెద్ద ఉత్తరానికి చిన్న జవాబని అనుకోకండేం—స్థలం లేదు ఈసారి.

## ఇ. సత్యవతీదేవి, డెహరాడూన్

"మొన్న 10 వ తారీఖున ఇక్కడికి 22 మైళ్ళ దూరంలో ఉన్న ముస్సోరీ వెళ్ళాము. మీరు ఈ పేరు వినే ఉంటారు. అసలు రైల్వే లైను డెహరాడూన్‌తో ఆఖరు. ఇక్కడనుంచి బస్సులో ముస్సోరీ వెళ్ళాలి. అంతా కూడా కొండలే. సముద్రమట్టానికి 8,000 వేలఅడుగులఎత్తులో ఉంది. సముద్ర మట్టానికి మా వూరు 2,000 అడుగుల ఎత్తుంది. ఇక్కడనుంచీ కూడా కొండలమీదనుంచి ప్రయాణం.

"ఆ రోజు బాగా మబ్బు పట్టింది. ఒక కొండ చుట్టూ తిరిగి ఇంకొక కొండమీదికి వెడుతుంది. ఒక్కొక్కసారి ఒక కొండమీదే లైన్లుగా ముందుకీ, వెనక్కీ వెడుతున్నట్లుగా ఉంటుంది. ఒక కొండ ఎక్కేసరికి కింద ఎన్ని మలుపులు తిరిగినదీ, ఎన్ని రోడ్లున్నదీ ముగ్గు పెట్టినట్టు కనబడుతాయి. కాని ఆ మేఘాల్లోకి వెడుతూంటే ఏ లోకంలోకో తేలిపోతున్నట్లు ఉంటుంది. ఉండుండి మేఘాలు లేకుండా క్లియరుగా అయిపోతుంది. మనం పైన ఉంటే మేఘాలు చాలా కిందికి ఉంటాయి. ఇదే మాదిరిగా వెడుతూంది బస్సు.

"అక్కడ ఇళ్ళన్నీ కూడా ఒక లైనులో ఉండవు. రెండు ఇళ్ళు కూడా సమానంగా ఉండవు. ఒకవైపు ఇంటికి రోడ్డు లెవిలు ఉంటుంది. ఇంకొకవైపు క్రిందనుంచి మెట్లు ఉంటాయి. ఇక్కడ మేడలు పైన ఒకలాగే, క్రిందా ఒకలాగే ఉంటాయి. ప్రతీ మేడకీ కూడా గాజు తలుపులే ఉన్నాయి. మామూలుగా మనకి కర్ర తలుపులు ఉంటాయి. కాని అల్లా ఎందుకున్నాయంటే, తరుచు మేఘాలు వస్తూంటాయి. అప్పుడు తలుపులు వేసుకోకపోతే లోపలికి వచ్చి ఇల్లంతా తడిసిపోతుంది. బట్టలు అన్ని కూడా తడిసిపోతాయి. ఈ కారణంచేత గాజు తలుపులైతే తలుపులు వేసుకున్నా వెలుతురుంటుంది. మేఘాలు రావు.

"మేము అక్కడికి వెళ్ళిన రోజు కొద్దిగా అక్కడక్కడ మేఘాలు అడ్డుకున్నాయి. కాని రాత్రికి బాగా వర్షం వచ్చేసింది. ఆ మర్నాడంతా కూడా విపరీతంగా చలి, వర్షం ఉంది. కాని మేఘాలు మనమీదికి వస్తుంటే ఏదో చెప్పలేని ఆనందం కలిగింది. మనం ఉండే మేడా, అందులో మనం తప్పించి ఒక చెట్టు కాని, మనిషి కాని, ఇల్లు కాని, ఏదీ కూడా కనుపించలేదు. అప్పుడు నాకు ఆకాశంలో తేలిపోతున్నామా అనిపించింది. అటువంటి సంతోషం నా జీవితంలో పొంది ఉండనేమో అనిపిస్తుంది. మా రెండవ అబ్బాయికి ఏణర్ధం. వాడు ఎంత సరదాగా ఆడుకున్నాడో, వాడి సంతోషం చూడాల్సిందే. ఆ మేఘాలు మనమీదికి వస్తుంటే, వాన లేకుండా, లోపల ఉన్నా కూడా మనమీద సన్నని జల్లు పడుతూంటే ఎంత హాయిగా ఉందో మాటల్లో చెప్పలేను.

"అక్కడ చలికాలంలో ఇళ్ళు చవగ్గానే ఉంటాయి. సమ్మరులో 100 రూ. ఇల్లు, 500 రూ. తీసుకుంటారట. నవంబరు, డిసెంబరుతో స్నో ఫాల్సు చూడ్డానికి వెడదామని ఉంది. అటువంటి ఆనందకరమైన విషయాలు మనం చూస్తున్నప్పుడు మన ఆప్తులు ఎవరైనా చూడా లనిపిస్తుంది.

"మా పుట్టింట్లో మొల్ల పందిరి ఉంది. సన్న జాజులకన్నా కొంచెం లావుగా పొడుగ్గా ఉంటాయి. చిన్న పందిరి. కాని ఎన్నో మొగ్గలు పూసేది. అవి చూసినప్పుడల్లా మీరు జ్ఞాపకం వచ్చేవారు. మరి ఎందుకు జ్ఞాపకం వచ్చేవారో తెలియదు."

ఇప్పు డీ మేఘ మాలికల మధ్య నా మాట ఎటున్నా పతితలు జ్ఞాపకం వచ్చారు—అది చాలు. ఇంత చక్కటి ఉత్తరాలు రాయగల మీరు—నా ఉత్తరాలు బావుండవా?—అని అడగటం సాహసమే!

# పాప బిల్లు

[31 వ పేజీ తరువాయి]

(అబ్బాయి పెద్ద నిట్టూర్పు విడిచి, కుర్చీలో వెళ్లి కూర్చొంటాడు. కొద్ది క్షణాల్లో పాప వస్తుంది.

పా: నువ్వు పాస్ అయితే నాకే మిస్తావు?

అ: ఏమియ్యాలేం?

పా: బలే, నాకు ఏం చెప్పావు? ఒక చిన్న కుక్క పిల్లను, నీ స్నేహితుడి ఇంట్లోంచి—

అ: మీ అమ్మ కుక్కను పెంచనిస్తుందేం?

పా: ఎందుకు పెంచనివ్వదూ? అందరిళ్లల్లో కుక్క లుంటాయి గదా, మనింట్లో ఉంటే ఏం? అమ్మ వద్దంటే మాత్రం వినే దెవరు?

అ: అయితే అడుగుతా నుండు నా స్నేహితుణ్ణి. ఇప్పటికే అన్ని పిల్లల్ని ఎవరికైనా యిచ్చేసేడేమో.

పా: ఇంకా రెండున్నాయి. కుక్కలు మంచి వచ్చేటప్పుటు రోజూ చూస్తుంది.

అ: అవునే, దర్జీ వచ్చాడెందుకే?

పా: బలే, నా పుట్టిన రోజు రావటంలే? నాకు ఫ్రాక్ కుట్టడానికి గుడ్డ తీసికెళ్లాడు. ఈసారి నా స్నేహితుల్ని ఎంతో మందిని పిలుస్తాను. నాకెన్ని వస్తువులు వస్తయ్యో నీకు తెలుసా, అన్నయ్యా?

అ: నువ్వు ప్రెజెంట్స్ కోసమే ని పుట్టిన రోజు చేసుకొంటా వనుకొంటాను.

పా: అవును. లేకపోతే మరెందుకు పుట్టినరోజు చేసుకొంటారు? ప్రజంట్లు దొరక్కపోతే, పూరి కేనే అందర్ని పిలిస్తే సరిపోతుంది. దానికి పుట్టిన రోజంటం ఎందుకు?

అ: కానీ, నేను చిన్నప్పటి నుంచి గూడా పుట్టినరోజు చేసుకోలేదు.

పా: చేసుకొన్నా, నీకేవీ దొరికేవి కాదులే.

అ: ఎందుకని?

పా: నీ స్నేహితులంతా చినిగిన చొక్కాలు వేసుకొనేవాళ్లేగా. వాళ్ళు నీకు ప్రజంట్లు గూడా తెస్తారూ?

(సశేషం)

# ఆద్యంతాలు

[21 వ పేజీ తరువాయి]

"కాలం అలాంటిది"

"అంతేనా?"

"నా మార్పుల్ని సరిదిద్దేందుకు నువ్వు లేవు"

"ఇంకా?"

"నువ్వు లేవనే బాధ"

"నిజంగా వుందా?"

"ఉందేమో?—లేకపోతే యిలా నిరిష్టంగా ఎలా వుండిపోతాను?—రాత్రి పగలూ యిదే ఆలోచన"

క్షణకాలం మాట్లాడలేదు కోమలి.

"మరి నే వెళ్ళేదా?"

"నిజంగా ఆ ప్రశ్న నన్నడగాలా?—దాని జవాబు సిద్ధం చేసుకునే వచ్చావ్ నువ్వు"

"సూటిగా మాట్లాడలేవా నువ్వు?"

"క్షేమంగా వెళ్ళిరా—సరా?"

ముఖం కప్పుకొని ఏడుస్తూ వెళ్ళిపోయింది కోమలి.

మరో ఆరు నెలలకి తిరిగి వచ్చింది—

భర్త పోయాడని—అమ్మ చెప్పగా విన్నాను.

ఎప్పుడన్నా గన్నేరు చెట్టు నీడలో నిలబడితే కోమలి కన్పిస్తుంది—గాలిలో రెప రెప లాడే ఆకులా, మోడువోయిన వృక్షంలా—

జీవితంలో మొదలూ, తుదీ చూసిన కోమలి—నా జీవితాని కింకా మొదలే లేదు? ★

**నాటిక:**

# వానజల్లు

[ఒక బెంగాలీ నాటికకు అనుసరణ]

## —శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యము

(గత సంచిక తరువాయి)

శ్యా: అబ్బబ్బ, ఏమిటి తమ్ముడూ, నువ్వు గూడాను? నేను వెళ్లి టిఫిన్ ఎరేంజి చేస్తాను.

పా: అమ్మా, అన్న ప్యాసయినాడు గదా! నాకు ఐస్‌క్రీం యివ్వవూ?

శ్యా: నాన్నను అడుగు. (లోపలికి పోతుంది.)

పా: నాన్నా, ఐస్‌క్రీమ్, అన్న కెంతో యిష్టం నాన్నా.

గో: వో నీ కిష్టం లేదు కావును.

పా: నాకూ యిష్టమే,. చెప్పు, నాన్నా, కొని పెట్టవూ?

గో: అమ్మను తెప్పించమను.

పా: అమ్మా, అమ్మా, నాన్న చెప్పారు ఐస్‌క్రీమ్ (పోతోంది.)

గో: అబ్బాయి ఎంత నెమ్మదో, పాప అంత తొందర. ఇవాళ ఐస్‌క్రీమ్ తీసుకొని రాకపోతే యింక బతకడమే!

నా: పిల్లలు యిదే మాదిరి మరి!

గో: నిన్ను వాళ్లలో ఒకడివిగా అనుకొని నీతో అలాగ కబుర్లు చెప్తారు.

నా: నేను గూడా అంతే. హుషారైన పిల్లలు లేని యిళ్లకు పోనేపోను.

గో: నేను సరిగ్గా వ్యతిరేకం. మామూలుగా నా దగ్గరకు ఏ పిల్లలూ రారు.

(పాప లోపలి వాకిలి దగ్గర నుంచొని)

పా: డబ్బు లెక్కడున్నాయి. నాన్నా? జేబులో లేవే?

గో: జేబులోనివన్నీ డ్రాయరులో పెట్టాను గావును.

పా: తాళం చేతులు?

గో: ఉండు, నేను తీసియిస్తాను.

(గోపాలరావు, పాప లోపలికి వెళ్తారు.)

అ: మామయ్యా, నేను హంపీ వెళ్తున్నాను.

నా: ఎవరితోటి?

అ: రఘూవాళ్లు పోతున్నారు. నాన్న అంతా మాట్లాడి వచ్చారు.

నా: చాలా మంచి చోటు. నేను రెండు మూడు సార్లు వెళ్లాను.

అ: ఇటువంటి చోటికి ఎక్స్‌కర్షన్ పోవటం నా కిదే మొదటిసారి.

నా: చాలా బాగుంటుందిలే. చూస్తావుగా. ఆ చోటు ఆంధ్రులకు ఎంతో పవిత్రమైంది. నీకు తెలుసుగా. అక్కడే శ్రీ కృష్ణదేవరాయలు రాజ్యం చేశాడు. ఆయన కాలంలో తెలుగు సాహిత్యం మూడు పువ్వులూ, ఆరు కాయలూ కాచింది. ఆయనే అఖండమైన కవి. ఆయన ఆస్థానం అల్లసాని పెద్దన, నంది తిమ్మన, రామరాజభూషణుడు, తెనాలి రామకృష్ణుడు మొదలగు అష్ట దిగ్గజాలతో తులతూగుతుండేది.

అ: నువ్వు గూడా మాతో రా రాదూ, మామయ్యా?

నా: నాకు సెలవు ఎక్కడరా? అయినా, నువ్వు అక్కడికి వెళ్లి ఉత్తరం వ్రాయి. వీలుంటే శని ఆదివారాల్లో వస్తాను.

అ: నీ దగ్గర మన లిటరేచర్ సంగతులు వింటూంటే చాలా బాగుంటుంది.

నా: "ఆంధ్రప్రశస్తి" యిస్తాను. అక్కడకు వెళ్లేటప్పుడు చదువుకొందువు గానీ.

(గోపాలరావు లోపలినుంచి పిలుస్తాడు. 'నారాయణా, రా, టీ తాగుదాము).

నా: వస్తున్నా. (లేచి ద్వారం వైపు వెళ్తాడు.)

**పాత్రలు**

**శ్యామల**
**అబ్బాయి**
**గోపాలరావు**
**నారాయణ (స్నేహితుడు)**
**పాప (అమ్మాయి)**

నా: అవును. అబ్బాయీ, నువ్వు అమ్మకు దణ్ణం పెట్టలేదేం?

అ: పెట్టాను.

నా: ఒక్క సంగతి ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకో. ఎవ్వరి మనస్సు గూడా వూరికే కష్టపెట్టగూడదు. (లోపలికి పోతాడు.)

(అబ్బాయి విచారముఖంతో టేబిలు వైపు వస్తాడు. కొద్ది క్షణాలు మౌనంగా కూర్చుంటాడు. తర్వాత వాని తల్లి ఫోటో తెచ్చి తదేక దృష్టితో చూస్తుంటాడు. దాన్ని టేబిలు మీదుంచి నాలుగు వేపులా చూచి నమస్కరిస్తాడు. సరిగ్గా ఆ సమయానికే శ్యామల వస్తుంది.)

శ్యా: అబ్బాయి, రా. టీ, ఫలహారము చల్లారి పోతున్నవి.

అ: (త్వరగా ఫోటో దాచిపెట్టి) వస్తున్నా. నువ్వు పద.

శ్యా: నీ కోసం అందరూ కూర్చున్నారు. ఒక్కడివి ఏం చేస్తున్నా విక్కడ?

అ: అమ్మ సంగతి జ్ఞాపకం వచ్చింది.

శ్యా: వో.

అ: నువ్వు అమ్మను చూడలేదు కదూ?

శ్యా: లేదు.

అ: నాకు గూడా అమ్మ సంగతులు ఏవీ గుర్తు లేవు.

శ్యా: ఎలా గుర్తుంటయి, చెప్పు. అప్పుడు నీకు రెండేళ్లు.

అ: అత్త చెప్పేది, అమ్మ అచ్చుగా మల్లెపూవులా ఉండేదని.

శ్యా: నేనూ అదే విన్నాను. అందరూ ఆమె సంగతి గొప్పగా చెప్తారు.

అ: ఇవాళ కనక అమ్మ ఉంటే ఏమి చేసేదో కదా?

శ్యా: ఆనందపడేది, ఎంతో సంతోషించేది. పిల్లలు చక్కగా ప్యాసయితే తల్లి కొచ్చే ఆనందం యిలాగ అలాగ అర్థమవుతుందా?

అ: (హఠాత్తుగా) మరి, నువ్వు సంతోషిస్తున్నావా?

శ్యా: (ఆశ్చర్యంతో) ఏమిటీ?

అ: (రోషం ఆరోపిస్తూ) నీ కళ్ల వెంబడి ఆ నీళ్లేమిటి?

శ్యా: (కళ్లు తుడుచుకుంటూ) నీళ్లా! ఎక్కడ? లేవే?

అ: నాకు తెలుసు. నువ్వు సంతోషపడలేదు.

శ్యా: ఏమిటిరా, నువ్వనేది?

అ: ఏ రోజు నీ పిల్ల ప్యాసవుతుందో, ఆరోజు సంతోషపడ్తావు. అప్పుడు నీ కళ్ల వెంబడి నీళ్లు కారవు. ఆగకుండా నవ్వుతావు. అదీ తల్లి ఆనందం.

శ్యా: మళ్లీ అదే మాటా!

అ: ఇదే నిజమని స్పష్టంగా చెప్పగలను. నేనెలాగైనా ఫెయిల్ కావాలని నీవు కోరావు. నేనొక కోతి వెధవ ననుకొన్నావు.

శ్యా: (కోపంతో) నువ్వు ఒక కోతి వెధవవు అప్పుడే అయి కూర్చొన్నావు. (అబ్బాయి రెండు చెంపలు పెళ్లున వాయిస్తుంది.) మర్యాదగా మాట్లాడడం వచ్చిందాకా, మాట్లాడబోకు. వెళ్లు, పో.

(ఆశ్చర్య భయాలతో కళ్లనీళ్లు తుడుచుకుంటూ అబ్బాయి లోపలికి పోతాడు. దుఃఖాభిమానాలతో శ్యామల క్రుంగిపోతుంది. కుర్చీలో కూర్చొని, టేబిలు మీద తల మోపుతుంది. కొంచెంసేపుండి గోపాలరావు వస్తాడు. శ్యామలను పూర్తిగా పరీక్షించి, రెండోవైపు తిరిగి మాట్లాడతాడు.)

గో: అబ్బాయి పెద్దవాడవుతున్నాడు కదూ, వాడిని చెయ్యి చేసుకోటం ఇహ అంత మంచిదికాదు. (కొంచెం ఆగి) అందులో ముఖ్యంగా యివాళ, ప్యాసయినాడని కబురు గూడా వచ్చిందాయెను.

శ్యా: మీరు కొంచెం ఆపుతారా?

గో: ఆ గదిలో దిండులో తల దూర్చి పడుకొన్నాడు. అది చూస్తుంటే ఏ తండ్రికి బాగా ఉంటుంది చెప్పు. అది చూసి పాప కూడా ఏడుస్తున్నది.

శ్యా: ఏడవనీయండి.

గో: వూ, పాపం, నారాయణ మీపోట్లాటల మధ్య పడి నలిగిపోతున్నాడు. ఏదో మనమంతా కలిసి సంతోషిస్తామని మంచి వార్త తీసుకొచ్చాడు.

శ్యా: సంతోషపడండి. ఎవరొద్దన్నారు?

గో: నీకేమి సంబంధం లేదా?

శ్యా: అవును, మరి, ఏం చేసేది? మీ అబ్బాయి నన్ను చూడలేకుండా గూడా ఉంటూంటే! నేను వాడి తల్లిని కాకపోతిని. పనిచేసేదాన్ని అనుకొంటాడో, మరేమను కుంటాడో, భగవంతుడికి తెలియాలి.

గో: అసలు ఇలా ఎందుకంటుంది?

శ్యా: మళ్లీ ఎందు కేమిటి? మీవల్లనే. ఒక్క గారాబం చేస్తేనే చాలదు. పిల్లలు పెరిగి పెద్దవారైతే దండిస్తూ గూడా ఉండాలి. మీ కెన్నాళ్లబట్టి చెప్తున్నాను? కోతి వెధవయి కూర్చొన్నాడు. వాడి మాటలు విన్నవాళ్లెవరూ వాడొక మర్యాదస్థుల కుటుంబపు వాడనుకోరు. ఛీ, ఎవళ్లచే ఒక్క మాటపడలేదు గాని, చివరకు వీడిచేత పడాల్సి వచ్చింది. నన్ను నానా మాటలు అన్నాడు. దీని కంతకూ కారణం ఏమిటంటే, వాడి తల్లికంటే ఎక్కువగా ఉండేవాడిని పెంచి పెద్దచేశాను.

గో: నువ్వు పొరబాటు పడుతున్నావు, శ్యామలా.

శ్యా: పొరబాటేమీ లేదు. మీ పిల్లవాడి కోసం నేనేమి చేయలేదు? మాతృత్వపు రసాన్ని పిండి పూర్తిగా వాడి తలమీద పోశాను. పాపకు ఏమి చెయ్యలేదు. దేనివల్ల అబ్బాయికి సుఖము కల్గుతుందో, దేనివల్ల వాడు పెద్దవాడవుతాడో, దేనివల్ల రెండో పెళ్లి చేసుకోటం మూలాన్ని ఎవ్వరూ గూడా మీవైపు వేలుపెట్టి చూపలేరో, అవన్నీ చేశాను. కాని, నేటికి తెలిసింది అవన్నీ అబద్ధమనీ, ఇదంతా ఎవరి కోసమని అడగగలరా? మీ కోసరము, మీ బంధువుల కోసరం, ఎవరైతే నన్ను చూసి ఓర్వలేదో వారి కొరకు. ఎల్లప్పుడూ నా మీద వాడికి ద్వేషం పుట్టించారు.

గో: అయితే ఇప్పుడేం చెయ్యమంటావు? నేను మాత్రం—

శ్యా: ఒక టాక్సీ తెప్పించండి.

గో: ఎందుకు?

శ్యా: నేను మా అమ్మగారింటికి పోతాను.

గో: ఇవాళే.

శ్యా: ఇప్పుడే.



గో: (దీర్ఘ నిట్టూర్పు విడిచి) హూ.

శ్యా: పాప వస్తానంటే వస్తుంది. అబ్బాయి హంపీ వెళ్లిన తర్వాత వస్తాను. (లోపలికి పోతుంది.)

(కొంచెం ఉండి నారాయణ వస్తాడు.)

నా: ఏమిటయింది, గోపాలరావు?

గో: ఏమి చెప్పేది, నారాయణా? ఇహ నేను భరించలేను. శ్యామల కేమయిందో? ఏది చెప్పినా వినేటట్టు లేదు. ఏదీ నచ్చటం లేదు.

నా: ఒక్క అక్కయ్యదే కాదు తప్పు. అబ్బాయి కూడా ఈ మధ్యన నోటి కెంత వస్తే అంత అంటున్నాడు.


గో: ఈ ఇలా గవుతుందని నేనెప్పుడూ అనుకో లేదు. వాళ్ల అమ్మను నువ్వు చూడలేదు నారాయణా ఆమె చక్కటి అందగత్తె. కాని, ఆమె చాలా స్వార్థ పరురాలు. ఇది ఆశ్చర్యమైన సంగతి. ఇప్పు డాలో చించి చూస్తే, మా పెళ్లిఅయిన తర్వాత కొన్నేళ్లు మా యింట్లో ఏమి సుఖం లేకుండాపోయింది. నా బంధువుల్ని ఎవర్నీ గూడా ఆమె చూడలేక పోయేది. ముఖ్యంగా ఈ దుఃఖముతోనే మా అమ్మ చనిపోయిందని చెప్పాలి.

నా: ఈ సంగితంతా నాకొకసారి చెప్పావు.

గో: శ్యామలతో పరిచయ మయిన తర్వాత ఆవిడ మనస్సు ఎంత ఉదారమైందో తెలిసికొన్నాను. చక్కటి హృదయము. ఆమెను పెళ్లి చేసికొని అబ్బాయిని సరియైన పద్ధతిలో పెద్దవాడిని చేయ గలనని అనుకొన్నాను. వాడికి తల్లి లేని కొరత శ్యామల తీరుస్తుందని కూడా ఆశ పడ్డాను. కాని, ఏమిటిది ఇలా అయింది?

నా: నెమ్మది మీద అంతా బాగవుతుంది. అక్కయ్యకు మెల్లగా సమాధానపరిచి చెప్తే—

గో: నీ అక్కయ్య వాళ్లవాళ్ల యింటికి వెళ్లాలు దేరుతున్నది.




శ్రీ టి. సత్యనారాయణరావు

నా: ఒకసారి వెళ్లి వస్తేనే మంచిదిలే. అబ్బాయి గూడా హంపీ వెళ్తున్నాడని విన్నాను.

గో: ఆ, నువ్వొక టాక్సీ తీసుకొని, శ్యామలను వాళ్లింట్లో దింపిరా.

నా: సరే, వెళ్లి వస్తాను. నువ్వు మరేమీ గోల చెయ్యబోకు. (పోతాడు).

(పాప ఒక పెట్టెతో వచ్చి, టేబిలు మీదుంచి సర్దుతుంటుంది.)

గో: ఏమిటి, నువ్వు అమ్మతో వెళ్తున్నావా?

పా: ఆ.

గో: అమ్మ ఏది?

పా: ఆ గదిలో ఏమిటో చేస్తున్నది.

గో: ఓ. (కొంచెం ఆగి) అన్నయ్య?

పా: చూడలేదు.

గో: ఓహో.... (దీర్ఘ నిశ్వాసం తీస్తూ లోపలికి వెళ్తాడు.)

(అబ్బాయి వస్తాడు. పాప పెట్టె సర్దటం చూసి)

అ: ఏమిటి చేస్తున్నావు?

పా: కనపడటంలే?

అ: ఎందుకు పెట్టె సర్దుతున్నావు?

పా: మామయ్యగా రింటికి పోతున్నాను.

అ: ఒక్కతెవే?

పా: అమ్మా, నేనూ.

అ: ఓ (టేబిలు దగ్గరకు వస్తాడు.)

పా: నువ్వు అమ్మతో పోట్లాడావు కదూ.

అ: చాల్లే, ఆపు— నీ గొప్పతనం చూపిం చక్కర్లేదులే.

పా: ఈ మధ్య నువ్వు మరీ పోట్లాట మారి వవుతున్నావు.

అ: నీకే చేప్పేది. నోరు ముయ్యి.

పా: నన్ను కూడా కసరుతున్నావా? ఉండు, నాన్నతో చెప్తాను. (పాప లోపలికి పోయిన తర్వాత అబ్బాయి కొంచెంసేపు ఆలోచిస్తుంటాడు. హఠాత్తుగా పెట్టెను లాక్కొని మళ్లీ సర్దడం మొదలుపెట్టాడు. తన పెట్టెలోంచి చొక్కాలు, బట్టలు తీసి దాంట్లో ఉంచుతాడు. లోపలి నుంచి శ్యామల గొంతు వినిపిస్తుంది. "పాపా, పెట్టె ఎక్కడ పెట్టావు?" పాప: "అన్నయ్య గదిలో.") (కొద్ది సేపట్లో శ్యామల పెట్టె వెతకటానికి వస్తుంది.)

శ్యా: (పాపను ఉద్దేశించి) ఏదీ, పెట్టె లేదే యిక్కడ?

అ: నా దగ్గర ఉంది.

శ్యా: తే యిటు, సర్దుకోవాలి.

(కిందికి చూస్తూ అబ్బాయి పెట్టె అంది స్తాడు. శ్యామల దాంట్లోంచి అబ్బాయి షర్టులు బైటికి తీస్తుంది.)

శ్యా: ఇవన్నీ దీంట్లో పెట్టింది ఎందుకు? అక్కరలేని వస్తువులన్నీ. ఏవి తీసుకెళ్లాలో, ఏవి అక్కరలేదో గూడా తెలీదు.

అ: అవన్నీ నా గుడ్డలు.

శ్యా: ఎందుకూ?

అ: నేను గూడా వస్తాను.

శ్యా: ఎక్కడికి?

అ: నీతో.

శ్యా: నాతో వస్తావా? నాతోనా?

అ: నీకు కష్టం కలిగించటం నా కిష్టం అయినప్పటికీ, ఏమిటో యిలా అవుతుంది. నాతల సరిగా వుండదు, నా మాట సరిగా రాదు, ఏమిటో పిచ్చివాడిలా అవుతాను. నువ్వేమో అనుకుంటావు—

శ్యా: నే నేమీ అనుకోను, అబ్బాయీ. నీదేమీ తప్పు కాదు. అంతా నాదే. నీకు తల్లిలేని కొరత తీర్చలేకపోయినాను. నీ స్వంత తల్లిని కాలేక పోయినాను—

అ: అమ్మా, అమ్మా!

(శ్యామల దగ్గరకు పోయి, పాదాలకు నమస్క రిస్తాడు. ఈ లోపల గోపాలరావు పాపను తీసికొని తలుపు దగ్గర నుంచొని శ్యామలను, అబ్బాయిని చూస్తాడు.)

శ్యా: (వంగి అబ్బాయిని దగ్గరకు తీసుకొంటూ) అబ్బాయీ!

అ: నేను హాస్టలుకు వెళ్లను, అమ్మా!—

శ్యా: నిన్నసలు వెళ్లనిచ్చే దెవర్రా? ఇహనుండీ నా మాట వినకపోయావంటే చెంప పగలకొట్తా, తెలుసునా! జ్ఞాపకం ఉంచుకో. (లోపలి నుంచి టాక్సీ యొక్క హారన్ వినబడుతుంది. నారాయణ గట్టిగా కేక వేస్తాడు. "గోపాలరావ్, టాక్సీ వచ్చింది")

గో: (తృప్తిపూర్వకమైన సంతోషముతో) ఇంక టాక్సీ అవసరం లేదు నారాయణా. దాన్ని పంపించి నువ్వు పైకిరా.

(ఈ మాటలు విని శ్యామలా, అబ్బాయి తిరిగి చూస్తారు. కళ్లు నీళ్లతో నిండి ఉంటవి. పెదవుల మీద చిరునవ్వు నాట్యం చేస్తుంటుంది. సిగ్గు గూడా మెరుస్తుంటుంది. తొలకరి వానజల్లు పోయి ఆకాశం నిర్మల మవు తుంది.) (తెర)

[సమాప్తం]

